క్లుప్తంగా

ఘనంగా జంబులమ్మ, మారెమ్మ దేవర



నీళ్ల బిందెలతో ఉత్సవానికి తరలివెళ్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలోని జీకేఎల్ఎస్ నగర్‌లో వెలసిన గద్వాల జంబులమ్మ, మారెమ్మఅవ్వల దేవర మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది డిసెంబర్ నెలలో ఈ ఉత్సవాన్ని జరుపుకోవడం అనావాయితీ. ఇందులో భాగంగానే దేవరను బుడగజంగాల కులస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు సర్పంచ్ జంబయ్య తెలిపారు. తమ కులస్తుల ఆరాధ్యదైవమైన జంబులమ్మ, మారెమ్మలను కొలచడం పూర్వీకుల నుంచి ఆచారంగా వస్తుందన్నారు.

ఆయుర్వేదంతో రోగాల నుంచి ఉపశమనం



మాట్లాడుతున్న డాక్టర్ నరేష్ కుమార్

గోనెగండ్ల: ఆయుర్వేద వైద్యంతో రోగాల నుంచి శాశ్వత ఉపశమనం పొందవచ్చని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు నరేష్ కుమార్, ఆరోగ్య భారతి ప్రాంతీయ కార్యదర్శి డాక్టర్ రామశర్మ, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని హెచ్. కైరవాడి గ్రామంలో ఆరోగ్య భారతి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో 250 మంది మహిళలకు, 160 మంది పురుషులకు 60 మంది చిన్న పిల్లలకు వైద్య చికిత్సలు అందించారు. కార్యక్రమంలో లోకేశ్వర రెడ్డి, జగదీష్, సత్యనారాయణ గుప్త, శ్రీనివాస రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



శానిటరీ వర్కర్లతో చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోని టౌన్: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని పాత బస్టాండు సర్కిల్, సంతపేట, వడ్డేగేరి ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కాలువల్లో చెత్తాచెదారం, పూడిక, ప్లాస్టిక్ కవర్లు, కొబ్బరి బోండాలు తదితరాలు ఏవీ లేకుండా శుభ్రం చేయాలని వర్కర్లకు సూచించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో మంగళవారం అయ్యప్పస్వామి ఆలయం మొదటి వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకుడు సురేష్‌శాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం నుంచి అయ్యప్పస్వామివారి మూలవిరాట్‌కు నెయ్యితో పంచామృతాభిషేకం, విశేష పుష్పాలంకరణ తదితర పూజలు నిర్వహించారు. హోమం నిర్వహించి, భజనలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి మాలధారులు రమేష్, సిద్ధు, బండి శివకుమార్, మరలింగ, గర్జప్ప, శంకరప్ప, బండిలోకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందమ్మకు న్యాయం చేయండి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామతీర్థం అమ్రేష్

పెద్దకడబూరు : క్రూరమైన హింసకు లోనైచస్తూ బతుకుతున్న పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన గోవిందమ్మకు న్యాయం చేయాలని బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామతీర్థం అమ్రేష్ కోరారు. మంగళవారం ఆదోనిలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను బాధితురాలుతో కలసి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ గోవిందమ్మకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం రావాల్సిన రిలీఫ్ ఫండ్ ఇంత వరకు ఇవ్వకపోవడం తగదన్నారు. సమాజంలో తనలాంటి స్త్రీలకు అటువంటి క్రూరమైన హింస జరగకూడదని మనోధైర్యంతో బతుకుతుందన్నారు.

మహిమాన్వితం...

మంగరాయ మందిరం

- 16వ శతాబ్దంలో వ్యాసరాయలు ప్రతిష్టించిన విగ్రహం
- రాఘవేంద్రస్వామితో పాటు దాన సాహిత్యులు తపస్సు చేసిన ప్రాంతం
- రేపటి నుంచి ఉత్సవాలు
- 13న హనుమద్రతం, 15 మహా రథోత్సవం



మంగరాయ అంజనేయస్వామి ఆలయం,(ఇన్‌సెట్) వ్యాసరాయులు ప్రతిష్టించిన అంజనేయస్వామి విగ్రహం

ఆదోని అర్బన్: పట్టణంలోని మంగరాయ ఆంజనేయ స్వామి మహిమాన్వితుడిగా భక్తులతో పూజలు అందుకుంటున్నాడు. శ్రీకృష్ణదేవరాయల గురువైన వ్యాసరాయలు ఇక్కడ స్వామివారిని 16వ శతాబ్దంలో ప్రతిష్ఠించినట్లు స్థల పురానం చెబుతోంది. ఇక్కడ స్వామివారు మూడు అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ మందిరం మంత్రాలయం మఠం ఆధీనంలో ఉంది. గురువారం నుంచి మంగరాయ ఉత్సవాలు కొనసాగనున్నాయి. 13న హనుమద్రతం, 15న మహారథోత్సవాన్ని నిర్వహించనున్నారు.

స్థల ప్రాశస్త్యం

పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో 18వ శతాబ్దంలో రాఘవేంద్రస్వామితో పాటు 30 మంది యతీశ్వరులు, హరిదాసులైన దాస సాహిత్యులు తపస్సు చేసిన స్థలమని పురాణాలు చెబుతున్నాయి. పురంధరదాసులు, తిమ్మన్నదాసులు, జగన్నాథదాసులు, ఉడిపి బండకేరి మఠం స్వామిజీ విద్యామాన్యతీర్థులు, గోపాలదాసులు, రఘుప్రేమతీర్థులు, మోహనదాసులతో పాటు మరో 23 మంది స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. విజయదాసులవారు రఘుప్రేమ తీర్థస్వాములకు ఆధ్యాత్మిక చింతనచేసి గురుబోధన అంకితమిచ్చిన స్థలమని, రఘుప్రేమతీర్థులు ఈ సన్నిధిలో 40 రోజులు అఖండ ఉపవాసదీక్ష చేపట్టి మంగరాయ ఆంజనేయస్వామిని దర్శనం చేసుకున్నట్లు చెబుతారు.

మూడు అవతారాల్లో దర్శనం

మూడు అవతారాల్లో మంగరాయ ఆంజనేయ స్వామి భక్తులకు దర్శనమిస్తున్నారు. మొదట హనుమ, రెండోది భీమసేన, మూడో మధ్వాచార్యుల రూపం. స్వామికి ఇరువైపులా వైష్ణ చిహ్నాలు, శంకుచక్రాలు ఉంటాయి. మంగరాయ సన్నిధిలో ఉత్తరముఖాన నేరుగా చూసే విగ్రహం మరొకటి హంపీలోని యంత్రోదారక ఆంజనేయ స్వామి. మంగరాయ ఆంజనేయస్వామి చేతిలో సౌగంధిక పుష్పం, గద ఉంటుంది.

మూడో అవతారమే వ్యాసరాయలు..

మొదటి అవతారం భక్త ప్రహ్లాదుడు, రెండో అవతారం బాల్హిక చక్రవర్తి, మూడో అవతారం వ్యాసరాయలు, నాలుగో అవతారం మంత్రాలయం రాఘవేంద్రస్వామి అని ప్రతీతి. వ్యాసరాయలు హంపీ వద్ద తుంగభద్ర నది ఒడ్డున కూర్చొని ఉంటే సాక్షాత్తు ఆంజనేయస్వామి వానర(కోతి) రూపంలో వచ్చి ఇబ్బందిపెట్టేవారు. ఆయన వెంటనే ధ్యానంలోకి వెళ్లి చూస్తే స్వామి ప్రత్యక్షమై తన మూర్తులను ప్రతిష్ఠింపజేయాలని ఆదేశిస్తారు. దీంతో మొట్టమొదటి యంత్రోద్ధారక ఆంజనేయస్వామిని ప్రతిష్ఠిస్తారు. ఒకేఒక శిలంలో ఆయన అంకారం వేసి ప్రాణప్రతిష్ఠ చేస్తే ఆ శిలలో నుంచి స్వామి ఉద్భవించాడని చెబుతారు. వెంటనే ఆయనకు పూజలు చేసి వెళ్తారు. ఇలా ఆదోని పట్టణం, పెనుగొండ, కర్ణాటకలో కలిపి మొత్తం 734 ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారని పుణాలు చెబుతున్నాయి.

వారం రోజులపాటు ఉత్సవాలు

వ్యాసారాయ ప్రతిష్ఠాపన చేసిన నాటి నుంచి నేటి వరకు మంగరాయ సన్నిధిలో వారం రోజులపాటు ఉత్సవాలు దాససాహిత్యుల ఆధ్వర్యంలో జరుగుతూనే ఉన్నాయి. మార్గశిర శుక్ల త్రయోదశినాడు హనుమద్రతము, పౌర్ణమి రోజున మహారథోత్సవం జరుగుతుంది. అలాగే మంత్రాలయం మఠం ఆధీనంలో ఉన్నందున మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా జరుగుతాయి.

> **పీఠాధిపతి ఆధ్వర్యంలో ఉత్సవాలు**
>
> 
>
> మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. 13న హనుమద్రతం, పౌర్ణమి రోజు 15న మహారథోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. వారం రోజులపాటు ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం.
>
> – కొమ్రేష్ ఆచార్, మంగరాయ ఆంజనేయస్వామి ఆలయ మేనేజర్,

ఎలక్ట్రిక్ క్యాడ్ కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రిక్ క్యాడ్ కోర్సులు ప్రారంభమయ్యాయని, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ వారు విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచి ఉద్యోగ అవకాశాలను కల్పించే దిశగా కొత్తగా ఎలక్ట్రిక్ క్యాడ్ ఈసీఈ, త్రిపుల్ ఈ అధునాతన కోర్సులను ప్రారంభించిందన్నారు. కోర్సు ఫీజు రూ. 1500, కోర్సు వ్యవధి 90 గంటలు అని తెలిపారు. పై కోర్సులను పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్ మంజూరు చేస్తామన్నారు. ఆయా కోర్సులకు డిప్లొమో, ఐటీఐ, ఇంటర్మీడియెట్, బీటెక్ చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకొనవచ్చని తెలిపారు. వివరాలకు సెల్ నంబర్. 9966228745ను సంప్రదించాలన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కర్నూలు బైపాస్ గోనెగండ్ల సర్కిల్‌లోని రోడ్డులో డ్రైనేజీ నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి మంగళవారం పరిశీలించారు. అలాగే సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలించి.. వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మంచినీరు సరఫరా చేసే ఫిల్టర్ బెడ్, పంప్ హౌస్, మారెమ్మ కొండ వాటర్ ట్యాంక్, పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు.

ఇరుముడితో శబరిమలకు అయ్యప్పస్వాములు



ఇరుముడితో శబరిమలకు బయలుదేరుతున్న అయ్యప్పస్వామి మాలధారులు

ఆదోని అర్బన్: అయ్యప్పస్వామి దీక్షాపరులు మంగళవారం శబరిమల అయ్యప్పస్వామి సన్నిధికి బయలుదేరి వెళ్లారు. ముందుగా గురుస్వామి రామసుబ్బయ్య ఎస్‌కేడీ కాలనీలోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి కట్టారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి దీక్షాపరులు లింగారెడ్డిస్వామి, శ్రీనివాసులుస్వామి, శివస్వామి, విరూపాక్షిస్వామి, ఈశ్వరయ్యస్వామి, శశికుమార్‌స్వామి తదితరులను బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు పూలమాలలతో సన్మానించారు.

జంపాపురం గ్రామం నుంచి..

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామానికి చెందిన అయ్యప్ప స్వామి భక్తులు ఇరుముడి కట్టుకుని శబరిమలకు బయలుదేరి వెళ్లారు. మంగళవారం గ్రామంలోని శంభులింగేశ్వర స్వామి దేవాలయంలోని అప్పాజప్పా తాత మఠం ఆవరణలో గురుస్వామి చంద్రశేఖర్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తాదులకు ఇరుముడి కట్టించారు. భక్తులు లక్ష్మీకాంత్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, ఓంకార్ రెడ్డి, హేమంత్, బసవరాజు రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజు, నారాయణ, శివరామకృష్ణ, నరసప్ప డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన రిలేదీక్షలు మంగళవారం ఆరవ రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆందోళన చేస్తున్న కార్మికులకు సీపీఐ నాయకులు రంగన్న, మంత్రాలయం సీపీఐ నాయకులు భాస్కర్ యాదవ్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జాకీర్, వీరేష్, శివన్న, జనార్దన్, రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల గురించి తెలుసుకోవాలి



మాట్లాడుతున్న న్యాయవాదులు

ఆదోని రూరల్: ప్రతిఒక్కరూ మానవ హక్కుల గురించి తెలుసుకోవాలని ప్యానెల్ న్యాయవాదులు హెచ్.ఎం.కుమారస్వామి, లోకేష్‌కుమార్ అన్నారు. మంగళవారం మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మానవ హక్కుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ సమాజంలో ఉన్న ప్రతి మానవుడికి విద్యాహక్కు, జీవించే హక్కు ఉంటుందన్నారు. ఎవరికీ భయపడాల్సిన పనిలేదని, స్వేచ్ఛగా జీవించవచ్చన్నారు. అలాగే సమాజంలో ఆర్థిక అసమానతలను తొలగించేందుకు కూడా మానవులకు హక్కులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామంజిని, నాగరాజు, కళాశాల ప్రిన్సిపాల్ షాహినా పర్వీన్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

నందవరం : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్న గౌడ్, మండల కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో సీపీఐ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత కేంద్రం, రాష్ట్రంలో అవినీతి పెరిగిందన్నారు. అదాని గ్రూప్ కంపెనీల అవినీతిని కప్పిపుచ్చేందుకు క్రోనీ క్యాపిటలిజాన్ని ప్రోత్సహించడంలో కేంద్ర ప్రభుత్వ పాత్రపై దర్యాప్తు చేలయాన్నారు. మణిపూర్‌లోని హింసాత్మక పరిస్థితులపై పార్లమెంట్‌లో చర్చించాలని, సాయుధ బలగాలకు ప్రత్యేక రక్షణ చట్టం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం తాలూకా కార్యదర్శి శాంతప్ప, నాయకులు తాయన్న, విజయ్‌కుమార్, ముని, బియ్యం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



ఈరన్నను పరామర్శిస్తున్న బుట్టారేణుక

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న నందవరం మండలం హలహర్వి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈరన్నను మంగళవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక పరామర్శించారు. అతని ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుట్టా శివనీలకంఠ, శాప్‌నెట్ వర్క్ మాజీ చైర్మన్ మాచాని వెంకటేష్, మాజీ ఎల్లెల్సీ డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రేపు పీఎం సూర్యఘర్‌పై అవగాహన కార్యక్రమం

ఆదోని అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక ×సూర్యఘర్ ముఫ్ట్ బిజిలీ యోజనపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ హరి, ఏడీఈ పురుషోత్తం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పట్టణంలోని ఆర్టగేరి బస్టాండు సమీపంలోని వీఎస్‌బీ ఫంక్షన్‌హాల్‌లో కార్యక్రమం ఉంటుందన్నారు.

వేతనాలు మంజూరు చేయండి

ఎమ్మిగనూరుటౌన్: పాఠశాలల్లో పనిచేసే వాచ్‌మెన్ల పెండింగ్ వేతనాలను సత్వరం మంజూరు చేయాలని సీఐటీయూ నాయకులు రాముడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయ ఆపరేటర్ ప్రతాప్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత ఆరునెలలుగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే వాచ్‌మెన్లకు వేతనాలను మంజూరు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.

భగవద్గీత శ్లోకాల పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

పెద్దకడబూరు : కర్నూల్‌లో జరిగిన భగవద్గీత శ్లోకాల జిల్లాస్థాయి పోటీలలో పెద్దకడబూరులోని రెయిన్ బో ఇంగ్లిషు మీడియం హైస్కూల్ 6వ తరగతి విద్యార్థిని లావణ్య ప్రతిభ చాటినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ గోవింద రెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాలలో సిబ్బందితో కలసి లావణ్యను అభినందించారు. ఆయన మాట్లాడుతూ భగవద్గీతలోని 47 శ్లోకాలను ఏకధాటిగా చెప్పి మూడవ బహుమతి పొందినట్లు వివరించారు.

పట్టణంలో అలుముకున్న చీకటి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు తమ సమస్యల సాధనకై నిరవధిక దీక్షలో వెళ్లడంతో పట్టణంలో వీధి దీపాలు వేసే నాథుడు లేక మంగళవారం రాత్రి పట్టణంలో చిమ్మ చీకటి అలుముకుంది. పట్టణంలోని ప్రధాన కూడలితో పాటు వీధులు, శివారు కాలనీల్లో వీధి లైట్లు వెలగకపోవడంతో పట్టణ వాసులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

మట్కా బీటర్ అరెస్టు

పెద్దకడబూరు : మండల పరిధిలోని కంబదహాల్ గ్రామ సమీపంలోని ఎల్ఎల్‌సీ కాలువ దగ్గర అదే గ్రామానికి చెందిన బోయ చిన్న హనుమంతు మట్కా రాస్తూ, కర్ణాటక లిక్కర్ అమ్ముతున్నాడన్న సమాచారంతో మంగళవారం మాటువేసి పట్టుకున్నట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ నిందితుడిని అదుపులోకి తీసుకొని ఆయన దగ్గర ఉన్న రూ. 5,820 నగదుతో పాటు 120 కర్ణాటక(90ఎంఎల్) టెట్రా ప్యాకెట్లును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ఆదోని టౌన్: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సోమన్న, పీరాసాహెబ్, అహ్మద్‌బాషా, శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి శ్రీనివాసభవన్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పనిభారం తగ్గించేందుకు అదనపు వర్కర్లను తీసుకోవాలని కోరారు. విధి నిర్వహణలో భాగంగా ప్రమాదశాత్తు మృతి చెందిన కార్మిక కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించి, రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శివరామ్, కర్రెప్ప, కృష్ణమూర్తి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సమ్మెటివ్ పరీక్షలు

ఆదోని సెంట్రల్: విద్యార్థులకు ప్రతిఏటా విద్యాశాఖ నిర్వహించే అభ్యసన సామార్థ్యాల పరీక్షలకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ఇందులో భాగంగా బుధవారం నుంచి సమ్మెటివ్ పరీక్షలను నిర్వహించడానికి అధికారులు సిద్ధం చేశారు. ఆదోని నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా పరిషత్, ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 58, పట్టణంలో పురపాలక, ఎయిడెడ్, ప్రభుత్వ పాఠశాలలు 49, ఉన్నత పాఠశాలలు 23లతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో కూడా సమ్మెటివ్ పరీక్షలను నిర్వహించనున్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు రాష్ట్ర విద్యా పరిశోధన మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) ప్రశ్న పత్రాలను తయారు చేసింది. ఈ ప్రశ్నపత్రాలను ఇప్పటికే మండల కేంద్రంలోని ఎంఆర్‌సీలకు పంపించారు. పరీక్షల నిర్వహణకు గంట ముందు మాత్రమే ప్రశ్న పత్రాలను ఎంఆర్‌సీల నుంచి ఆయా పాఠశాలలకు తరలించాల్సి ఉంటుంది. 19వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి.

స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్ వాయిదా

సమ్మెటివ్ పరీక్షల సందర్భంగా అయా పాఠశాలల పరిధిలో జరిగే స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌ను వాయిదా వేశారు. ఈ నెల 16, 17వ తేదీలలో స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌లు జరగాల్సి ఉంది. అయితే వాటిని 20, 21తేదీలకు మార్చినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ, ఈఓపీఆర్డీ

నందవరం : విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని ఎంపీడీఓ పుల్లయ్య వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో ఎంపీపీఎస్, జెడ్పీ పాఠశాలలో ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలోమధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ..మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలన్నారు. వంట ఏజెన్సీ సభ్యులు శుచి, శుభ్రతతో వంటలు వండాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శి సుజాత, గ్రామ సర్పంచ్ మునెమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్‌తో సమస్యల పరిష్కారం



ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి

మంత్రాలయం : విద్యుత్ అదాలత్‌లో వినియోదారుల సమస్యలకు పరిష్కారం లభిస్తోందని రిటైర్డు న్యాయమూర్తి, ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయంలో విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఎమ్మిగనూరు డివిజన్ పరిధిలోని మంత్రాలయం, ఎమ్మిగనూరు, గూడూరు సబ్ డివిజన్ల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ నేపథ్యంలో మంత్రాలయం మండల కేంద్రంలోని రాఘవేంద్రపురంలోని ఇళ్ల మీదుగా 133 కేవీ లైన్ ఉందని, ఎంతో మంది ప్రమాదాలకు గురయ్యారని విద్యుత్ లైన్‌ను వేరే దిశగా మార్చాలని సర్పంచు తెల్లబండ్ల భీమయ్య వినతిని అందజేశారు. ఇందుకు చైర్మన్ స్పందిస్తూ లైన్ మార్పిడికి ఖర్చులు భరిస్తే తొలగించడానికి వీలవుతుందని బదులిచ్చారు. అలాగే చిన్నతుంబళం అవుట్ సోర్సింగ్ పోల్ టు పోల్ లైన్‌మెన్ వీరేష్ స్తంభం మీద నుంచి కింద పడి మరణించగా.. తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని భార్య విన్నవించారు. మాధవరం, ఖగ్గల్ గ్రామాల రైతులు తమకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కావాలని కోరగా వంతుల వారీగా ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయరాజు, ఏడీఈలు నాగేంద్ర ప్రసాద్, విశ్వశాంతి స్వరూప్, ఏఈలు పాల్గొన్నారు.

నేడు సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్

ఎమ్మిగనూరు: సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు ఈనెల 11న నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు తెలిపారు. అయితే ఎన్నికలను అధికార దర్పంతో ఏకపక్షం చేసేందుకు 'పచ్చ'నేతలు పావులు కదుపుతున్నారు. రైతుల భాగస్వామ్యంతో నడవాల్సిన సంఘాలకు రాజకీయ రంగులద్దే పనిలో తమ్ముళ్లు తలమునకలయ్యారు. తుంగభద్ర ప్రాజెక్టు పరిధిలో మొత్తం 58 సాగునీటి సంఘాలు (డబ్ల్యూయూఏ), 10 డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డీసీ)లతో పాటు తుంగభద్ర ప్రాజెక్టు కమిటీ(పీసీ)కి ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 24,372 ఎకరాలకు సాగునీరందించే గాజులదిన్నె ప్రాజెక్టు పరిధిలో 12 సాగునీటి సంఘాలతో ప్రాజెక్టు కమిటీనీ ఏర్పాటు చేస్తారు. గాజులదిన్నె ప్రాజెక్టు పరిధిలో సాగునీరందే గోనెగండ్ల, కోడుమూరు, దేవనకొండ, కృష్ణగిరి మండలాలకు చెందిన రైతులు ఓటర్లుగా ఉంటారు. మంత్రాలయం నియోజకవర్గంలో మైనర్ ఇరిగేషన్ పరిధిలోని రాంపురం కాలువకు ఒక సాగునీటి సంఘం ఎన్నిక జరగనుంది.

14న ఎన్నికలు

సాగునీటి సంఘాలకు ఎన్నికలకు ఈనెల 11న నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు ఆయా జిల్లాల కలెక్టర్ల నుంచి ఇరిగేష , రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. రైతుల ఓటర్ల తుది జాబితాను ఇప్పటికే ఆయా మండలాల తహసీల్దార్లు రూపొందించారు. ఈనెల 14వ తేదీ ఉదయం 10గంటలకు టీసీ మెంబర్ల ఎన్నిక, మధ్యాహ్నం 2గంటలకు సాగునీటి సంఘాలు(డబ్ల్యూఏ)కు ఎన్నికలు జరుగుతాయి. 17వ తేదీన సాగునీటి సంఘాల ప్రతినిధులంతా కలసి తమ పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డీసీ)లను ఎన్నుకుంటారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

కౌతాళం: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. మండల పరిధిలోని హాల్వి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సులో పాల్గొని అర్జీలను స్వీకరించారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్-పీజీఆర్ఎస్)లో అధిక శాతం భూ సమస్యలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. ఈ సదస్సుల వల్ల ఎటువంటి ప్రభుత్వ చలానా లేకుండా ఉచితంగా రెవెన్యూ సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి అర్జీకి రశీదు ఇవ్వడంతో పాటు వాటిని 45రోజుల్లో విచారించి, పరిష్కారం చూపుతామన్నారు. సదస్సులను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దారు మల్లికార్జునస్వామి, డిప్యూటీ తహసీల్దార్ రజినీకాంత్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ క్రాంతి, సర్వేయర్ బసవరాజు పాల్గొన్నారు.

కోసిగి: మంగళవారం కోసిగి మండలంలోని సాతనూరు, తుంబిగనూరు గ్రామాల్లో తహసీల్దార్ నిత్యానందరాజు, డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సాతనూరు గ్రామంలో 35, తుంబిగనూరు గ్రామంలో 4 చొప్పున రైతులు సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు.

మంత్రాలయం: మండల పరిధిలోని బూదూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్ సల్కాపురం రవి పాల్గొన్నారు. గ్రామంలో 13 సమస్యలకు సంబంధించి రైతులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

నందవరం : చేపట్టిన రెవెన్యూ సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలని స్పెషల్ ఆఫీసర్ రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని సోమలగూడూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కుర్ణికళ్యాణ మండలంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి భూసమస్యలపై 46 దరఖాస్తులు వచ్చాయి. ఆయా దరకాస్తులను తహసీల్దార్ శేషఫణి, సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసులు, స్పెషల్ ఆఫీసర్ విజయ్‌కుమార్‌లు స్వీకరించారు.

పెద్దకడబూరు : మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామంలో తహసీల్దారు శ్రీనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులలో ఆరుగురు రైతులు తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనాథ్

గంజిహళ్లి మహిళకు జిల్లా స్థాయి అవార్డు

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామానికి చెందిన చాకలి మహేశ్వరికి జిల్లాలో హమారా శౌచాలయ్ -హమారా సమ్మాన్ జిల్లా ఉత్తమ అవార్డు వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. అవార్డును మహేశ్వరి తరుపున గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు మంగళవారం కర్నూలు డీపీఓ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వర రావు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ మరుగుదొడ్డి నిర్మించుకొని పరిశుభ్రంగా ఉంచుకున్నందుకు గంజిహళ్లి గ్రామానికి రావడం ఆనందంగా ఉందన్నారు. అలాగే గ్రామంలో మరిన్ని మరుగుదోడ్లు ఆదర్శంగా ఉండేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే కున్నూరు గ్రామంలో ఉత్తమ కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ కింద గ్రామ సచివాలయం వద్ద నిర్మించిన మరుగుదొడ్డికి కూడా అవార్డు లభించిందని చెప్పారు. ఈ అవార్డును డీపీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరమ్మకు అందజేశారు.